క్లుప్తంగా

దశభుజ మహా గణపతికి విశేష పూజలు


పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనానికి స్థానిక భక్తులేకాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

21న పెద్దమ్మ దేవర

కూడేరు: మండలంలోని ఇప్పేరులో 21 (మంగళవారం)న గ్రామ దేవత పెద్దమ్మ దేవత ఊరు దేవర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటలకు పెద్దమ్మ ఆలయం వద్ద గంగపూజ, 8:30 పందిరి పూజ, సాయంత్రం 6:30 గంటలకు జలధి పూజ ఉంటుందన్నారు. రాత్రి 2:45 గంటలకు పెద్దమ్మ దేవతకు దున్నపోతు బలిదానం ఉంటుందన్నారు. బుధవారం విందు ఉంటుందన్నారు.

మక్కా యాత్రకు బయల్దేరిన మీరంబాషాకు సన్మానం


మీరంబాషాకు సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జీఎంఎస్ మీరంబాషా పవిత్ర హజ్‌యాత్రకు వెళ్తున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం సత్కరించి, వీడ్కోలు పలికారు. వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, మూలగిరిపల్లి ఓబన్నతో పాటు మైనార్టీ విభాగం నాయకులు మీరంబాషాను సత్కరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బెళుగుప్ప: మండల పరిధిలోని శ్రీరంగాపురానికి చెందిన వన్నూరస్వామి (55) అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మూడేళ్ల క్రితం భార్య మృతితో మద్యానికి బానిసయ్యాడు. మనస్థాపంతో శనివారం గ్రామ శివారులో పురుగుల మందు తాగి, కుమారులకు ఫోన్ చేశాడు. కుమారులు వెంటనే బెళుగుప్ప పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఘటనపై మృతుడి కుమారుడు హరిజన చిన్నా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

'సంకల్పం' ఉంటే సాధించలేనిది లేదు


మాట్లాడుతున్న గ్రంథాలయాధికారిణి రాధారాణి

కూడేరు: 'సంకల్పం' ఉంటే సాధించలేనిది ఏదీ లేదని కూడేరు గ్రంథాలయాధికారిణి రాధారాణి తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి రాధారాణి మాట్లాడుతూ తాను అత్యధిక మార్కులు సాధిస్తూ ఉన్నత చదువులు చదవాలన్న సంకల్పాన్ని గట్టిగా పెట్టుకోవాలని విద్యార్థులకు ఆమె సూచించారు. అప్పుడే చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న విలువైన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ముస్తఫా కమల్ బాషా (70) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు.

భారీ వర్షం


వేపులపర్తిలో వర్షం కురుస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండలంలోని ముప్పలకుంట, పిల్లలపల్లి, బొమ్మగానీపల్లి, నాగిరెడ్డిపల్లి, కన్నేపల్లి, వేపులపర్తి, భైరసముద్రం, బ్రహ్మసముద్రం తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ప్రభుత్వ విద్య.. ఉజ్వల భవిత

- ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు భరోసా
- 25శాతం సీట్ల కేటాయింపుతో విద్యార్థుల జీవితాల్లో వెలుగు


ఉరవకొండ ఎమ్మార్సీ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లోనూ కార్పొరేట్ స్థాయి విద్య అందుతోంది. నాడు– నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. దీనికితోడు నాణ్యమైన విద్య అందుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు 2024–25 విద్యాసంవత్సరానికి ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో విద్యార్థులను మొదటి విడత కింద ఎంపిక చేశారు. మిగిలిన పాఠశాలల యజమాన్యాలతో మాట్లాడి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఉన్నత చదువులే లక్ష్యం...

విజ్ఞానంతోనే పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. ఒక వైపు నాడు–నేడు కార్యక్రమంతో సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సమీప ప్రాంతాల పేద విద్యార్థులకు ఉచితంగా చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈమేరకు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

పారదర్శకతకు పెద్ద పీట:

అన్ని వర్గాల పేద పిల్లలు ఒకటో తరగతి నుంచి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ ఖర్చుతో విద్యనభ్యసించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 12 (1)(సి) అమలులో భాగంగా ప్రతి పాఠశాలలో 25 సీట్లు కేటాయించాలని నిబంధన అమలు చేసింది. ప్రభుత్వం ఈచట్టాన్ని పక్కాగా అమలు చేస్తుండటంతో ఎంపిక ప్రక్రియ ఎంతో పారదర్శకంగా జరుగుతుంది.

సీట్ల కేటాయింపు, ఫీజుల చెల్లింపు ఇలా..

ప్రతి ప్రైవేట్ పాఠశాలలో యాజమాన్యాలు అనాథ, దివ్యాంగ, హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు 5శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4శాతం, బలహీన వర్గాల పిల్లలకు ఆరు శాతం మొత్తం 25 శాతం సీట్లను కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు 6–14 ఏళ్ల లోపు పిల్లల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.1.20 లక్ష, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.1.44 లక్ష ఉండాలి. అర్బన్ పరిధిలోని పాఠశాలలో ఒక్కో అడ్మిషన్‌కు రూ.8 వేలు, రూరల్ పరిధిలో అడ్మిషన్‌కు రూ.6,500గా నిర్ణయించారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే ఆయా పాఠశాలలకు చెల్లిస్తుంది.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో తొలివిడతలో ఎంపికైన విద్యార్థుల వివరాలు

మండలం	ఎంపికైన విద్యార్థుల సంఖ్య
ఉరవకొండ	87
బెళుగుప్ప	18
కూడేరు	21
వజ్రకరూరు	13
విడపనకల్లు	8
కళ్యాణదుర్గం	73
రాయదుర్గం	62
కణేకల్లు	24
డి.హీరేహాళ్	13
కంబదూరు	29
శెట్టూరు	5
బొమ్మనహాళ్	7
	360

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తాం. విద్యార్థులను చేర్చుకోమని చెప్పినా, అడ్మిషన్లు తిరస్కరించినా, ఫీజులు చెల్లించాలని వేధించినా ఆయా పాఠశాలలపై ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. – మల్లారెడ్డి, ఎంఈఓ, బెళుగుప్ప

గొప్ప అవకాశం



కూలినాలీ చేసుకొని బతికే మాకు ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించింది. నా కుమారుడు భార్గవ్ రామ్ ఉరవకొండ వివేకానంద స్కూల్‌లో 1వ తరగతి చదవడానికి అవకాశం వచ్చింది. జగనన్న కల్పించిన అవకాశం ఎంతో గొప్పగా ఉంది. అన్న మేలు ఎన్నటికీ మరవలేం. – లక్ష్మి, అంబేడ్కర్ నగర్, ఉరవకొండ

సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తాం


సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

రాయదుర్గంటౌన్: నిరంతరం ప్రజల మేలు కోరుకున్న కమ్యూనిస్ట్ ఉద్యమనేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక సమైక్యాంధ్ర భవనంలో నాయకులు, కార్యకర్తలు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, అంజి, శంకర్, రమేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

హిందువులంతా ఐకమత్యంగా మెలగాలి

కణేకల్లు: హిందువులు ఐక్యంగా మెలగాలని విశ్వ హిందూ పరిషత్ నాయకుడు దేవరెడ్డిపల్లి రాజేష్ తెలిపారు.ఆదివారం స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు రాజేష్ మాట్లాడారు. గ్రామీణ, మండల స్థాయి నుంచి వీహెచ్‌పీ, భజరంగదళ్ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కుందుర్పి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు లెనిన్ బాబు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 5న మండల వ్యాప్తంగా 10 వేల మొక్కలు నాటేందుకు తమ సంస్థ పలు రకాల మొక్కలు అందుబాటులో ఉంచిందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్య, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులను సంస్థ నిర్వహిస్తోందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు అన్ని విధాలా టైలరింగ్, డ్రైవింగ్ తదితర శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రాజు, లక్ష్మణమూర్తి, బొమ్మలింగ, దిలీప్, శ్రీలత, కావ్య, లీలావలి, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన


కొవ్వొత్తులతో ప్రదర్శన చేసిన ఆస్పత్రి సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కొవ్వొత్తుల ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, రైడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, సిబ్బంది, పాల్గొన్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

24 నుంచి ఉరుసు ఉత్సవాలు


షాబాజ్ దివాన్ వలీ సమాధి


స్వామి వారు ఏర్పాటు చేసిన చెలిమి

బొమ్మనహాళ్: మతసామరస్యానికి ప్రతీక అయిన షాబాజ్ దివాన్ వలీ ఉరుసు మహోత్సవాలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉరుసు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 24వ గంధం, 6న దీపారాధన, 7న ఉరుసు, 8న జియారత్ ఉంటుందన్నారు. 7న తెల్లవారుజామున 3 గంటలకు షంషేరు దర్గా నుంచి పీఠాధిపతుల ఆధ్వర్యంలో ఊరేగింపు జరగనుంది.

షాబాజ్ దివాన్ వలి చరిత్ర ఇదీ..

కళ్లుహోళ వద్ద ఉన్న ఇసుక దిబ్బలపై షాబాజ్ దివాన్ వలీ ముస్లింలకు మహమ్మద్ ప్రవక్త బోధనలు చెప్పేవారు. ప్రజల్లో శాంతి సామరస్యాలు నెలకొల్పేవారు. అక్కడే దీక్ష చేపట్టేవారు. స్వామి వద్దకు వెళ్లిన ప్రజలు, భక్తులకు సూక్తులు చెప్పేవారు. హితబోధలు చేసేవారు. రోగాలు నయం చేసేవారు. ఇతర వ్యసనాలు, వ్యాపకాలను దూరం చేసేవారు. ప్రజల బాధలను తగ్గించేవారు. రాయలవారి సైన్యం, వాహనాలు, రథాలు, ఏనుగులు, ఒంటెలు, గుర్రాలతో పాటు బళ్లారి కోట నుంచి పెనుకొండ కోటకు వెళ్లే క్రమంలో దప్పిక అయ్యింది. నీటికోసం వెతుకుతూ స్వామిని అర్థించారు. అప్పుడు సైన్యాధిపతిని గుర్రంలో ఒక వైపు వెళ్లాల్సిందిగా స్వామి సూచించారు. గుర్రం వెళ్తుండగా, గుర్రం డెక్క ఎక్కడైతే దిగబడుతుందో అక్కడ చెలిమ తవ్వించమని సూచించారు. సైన్యాధిపతి గుర్రం మీద వెళ్తుండగా, గుర్రం డెక్క ఒక చోట దిగబడటంతో అక్కడే సైనికులతో చెలిమ తవ్వించారు. అప్పుడు నీరు ఉబికి వచ్చింది. దీంతో సైనికులు దప్పిక తీర్చుకున్నారు. ఏనుగులు, గుర్రాలు, ఒంటెలకు కూడా నీరు తాపారు. అప్పటి నుంచి చెలిమ ఇప్పటివరకూ అలాగే ఉంది. రోజూ దాని ద్వారా నీటిని తీసుకోని ప్రజలు వెళ్తారు. చుట్టూ కిలోమీటర్ మేర ఎక్కడ బోర్లు వేసినా నీరు పడడంలేదని రైతులు చెప్తున్నారు. రైతులు, భక్తులు చెలిమ నుంచి సీసాలు , బాటిళ్లలో నీరు తీసుకెళ్తుంటారు.

కళ్లుహోళలో సమాధి :

ఇసుక దిబ్బలపైనే దీక్ష చేస్తున్న స్వామిని ముస్లింలు, గ్రామస్తులు గ్రామంలోకి ఆహ్వానించారు. గ్రామంలోనే ఉంటూ శాంతిబోధనలు చేయాలని కోరడంతో స్వామి కళ్లుహోళ గ్రామంలో ఉండేవారు. అనంతరం ప్రజల్లో శాంతి సమరస్యాలు నెలకొల్పుతూ, భక్తిప్రవచనాలు, ప్రబోధాలు చేస్తూ పరమపదించారు. అప్పటి నుంచి స్వామి గుర్తుగా ఏటా ఉరుసు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు


అలంకరణలో వేంకటరమణస్వామి ఆలయం


ఆలయంలో కొలువుదీరిన ప్రసన్న వెంకటరమణస్వామి, అమ్మవారి మూలవిరాట్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం కోటలో వెలసిన కలియుగ ఆరాధ్యదైవం ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

ఉత్సవ వివరాలు : 20న కలశస్థాపన, స్వస్తివాచనం, రక్షాబంధనము, 21న ధ్వజారోహణ, సింహ వాహనోత్సవం, 22న సూర్యప్రభవాహనోత్సవం, 23న శేష వాహనోత్సవం, 24న హనుమద్ వాహనోత్సవం, 25న ఉదయం 11.30 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం గరుడోత్సవం, 26న గజేంద్ర వాహనోత్సవం, 27న ఉదయం 11 గంటలకు మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం, 28న పార్వేటోత్సవం , అశ్వవాహనోత్సవం, బాణ వేడుక, 29న వసంతోత్సవం, మయూర వాహనోత్సవం, 30న సప్తప్రాకారోత్సవ, శయనోత్సవం జరుగుతాయన్నారు.

పల్లెలకు చేరిన విత్తన వేరుశనగ


బేలోడులో ఆర్బీకేలో ఉంచిన విత్తన వేరుశనగ

గుమ్మఘట్ట: ఇటీవల జిల్లాలో అన్ని చోట్లా భారీ వర్షం కురిసింది. ఇన్నాళ్లూ సార్వత్రిక ఎన్నికల్లో తలమునకలైన రైతులు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలం బాట పట్టారు. ముంగారు సేద్యం పనుల్లో బిజీ అయ్యారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా విత్తన వేరుశనగ పంపిణీకి చర్యలు చేపట్టింది. ఆర్‌బీకేల్లోనూ వ్యవసాయ సిబ్బంది రైతులతో విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ చేయించుకుంటోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అర్హత ఉన్న రైతులందరికీ విత్తన వేరుశనగ అందించేందుకు వ్యవసాయ సిబ్బంది రిజిస్ట్రేషన్ చేస్తోంది. రాయదుర్గం నియోజకవర్గంలోని 79 ఆర్బీకే కేంద్రాలకు 14,150 క్వింటాళ్లు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 91 ఆర్బీకే కేంద్రాలకు 19,024 క్వింటాళ్లు, ఉరవకొండ నియోజకవర్గంలోని 60 ఆర్బీకే కేంద్రాల్లో 9,600 క్వింటాళ్ల కే 6 రకం, టీసీజీఎస్ 1694, కదిరి–లేపాక్షి (కే 1812) రకం విత్తన వేరుశనగను ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ నెల 18 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, 24న గ్రామాలలోని ఆర్బీకేల్లో విత్తన వేరుశనగ పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కలుషిత నీరు తాగి మూడు గేదెలు మృతి





శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ వడ్డే ముత్యాలుకు చెందిన మూడు గేదెలు కలుషిత నీరు తాగి ఆదివారం మృతి చెందాయి. బాధితుడు తెలిపిన మేరకు.. పశువుల పాకలో ఉంచిన నీటి తొట్టెల్లో గుర్తు తెలియని వ్యక్తులు క్రిమి సంహారక మందులు కలిపినట్లు తెలిపాడు. ఆ నీటిని తాగిన గేదెలు మృతిచెందాయన్నాడు. సుమారు రూ.1.20 లక్ష నష్టపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.


నాటి ఉపాధ్యాయులతో సరదాగా గడుపుతున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కూడేరు: హాయ్ చంద్రకళా.. ఎలా ఉన్నావంటూ నాగజ్యోతి.. ఏరా సోముశేఖర్..ఏంటి విశేషాలంటూ చంద్రశేఖర్. ఇలా ఆదివారం కూడేరు మండల పరిధిలోని ఇప్పేరు ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 2004–2005లో ఏడో తరగతి చదివిన 40 మంది విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులు చెన్నకేశవులు (ప్రధానోపాధ్యాయుడు), మల్లికార్జున, గోవర్ధన్, నాగరాజును ఆహ్వానించి, వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వపు విద్యార్థులు ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడింది చెప్పుకుంటూ వచ్చారు. నాటి చిలిపి పనులు, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో పూర్వ విద్యార్థులు సరదాగా గడిపారు.

ఘంటసాలకు స్వర నీరాజనం


పాటలు పడుతున్న గాయకులు

అనంతపురం కల్చరల్: ఏకబిగిన 12 గంటల పాటు నిర్విరామంగా సాగిన ఘంటసాల స్వరనీరాజనం అనంత వాసులను అమితంగా ఆకట్టుకుంది. జిల్లాలో తొలిసారి 8 సాంస్కృతిక సంస్థలు ఒకే వేదికపై నిలిచి స్వర నీరాజనం పేరుతో అమర గాయకుడు ఘంటసాలకు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం కావడంతో పాత పాటల ప్రేమికులు, సంగీత ప్రియులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆపాత మధురాలకు వేదికగా నిలిచిన లలిత కళాపరిషత్తు కిటకిటలాడింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన 'ఘంటసాల ది గ్రేట్' బయోపిక్‌ను నిర్మించిన సినీ నిర్మాత, దర్శకులు సీహెచ్ రామారావు అనంత వాసుల కృషిని అభినందించారు. అదే విధంగా ఎల్కేపీ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, కార్యదర్శి పద్మజ, రవికాంత్ రమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అరుదైన ఘంటసాల విగ్రహాన్ని పాత పాటల సమూహం వారితో కలిసి అనేక సాంస్కృతిక సంస్థలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఘంటసాల జయంతి, వర్ధంతులను క్రమం తప్పకుండా నిర్వహిస్తుండటం స్ఫూర్తిదాయకమన్నారు. నిర్వాహకులు ఘంటసాల రామయ్య, ఓబుళదాసు మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతతను పెంచే పాత పాటలు ఎక్కడ విన్నా శ్రోతలు ఆనందంలో తేలిపోతారన్నారు.

ఆకట్టుకున్న పాత పాటలు

జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన వందలాది మంది గాయనీ గాయకులు ఘంటసాల ఆలపించిన 101 పాటలతో సినిమాను తలపిస్తూ అలరించారు. ముఖ్యంగా సీనియర్ గాయనీ గాయకులు పాలసముద్రం నాగరాజు, బాలమురళీకృష్ణ, కేవీ మహీధర్, చరణ్, జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, సురేష్, ప్రొఫెసర్ సుధాకర్ బాబు శ్రీదేవి, బృంద, పద్మ, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాత పాటలను అద్భుతంగా ఆలపించారు. అదిగో నవలోకం.. నన్నుదోచుకుందువటే.. రాజశేఖర నీపై మోజు తీరలేదురా వంటి పాటలు, ఘంటసాల పద్యాలతో అలరించారు. ఇకపై ప్రత్యేక దినాలలో అన్ని సంస్థలు కలిసి పని చేయాలని తీర్మానించాయి. అనంతరం ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన పలువురు సామాజిక సేవా కార్యకర్తలు, అధికారులను నిర్వాహకులు సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో నిజరూప దర్శనం


అలంకరణలో రుక్మిణీ విఠల పాండురంగడు

అనంతపురం కల్చరల్: భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నగరంలోని రామనగర్ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో ఆదివారం మోహిని ఏకాదశి సందర్భంగా రుక్మిణీ విఠల పాండురంగ నిజరూప దర్శనం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం జరిగిన నిజరూప పాదదర్శనంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.. అంతకు ముందు ఇస్కాన్ వారి నేతృత్వంలో హరినామ సంకీర్తన జరిగింది. హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే అంటూ ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి ఏకాదశికి నిజరూప దర్శన భాగ్యం భక్తులకు కల్గిస్తున్నట్లు తెలిపారు. భక్తి భావం పెంచేలా ఇకపై ఇస్కాన్ సంకీర్తనామృతం నిర్వహించడానికి ముందుకు వచ్చిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహామంగళహారతి అనంతరం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దుస్తకర్ తిరుపతిరావు సెక్రటరీ ఆనంద్ మమేంద్రకర్ తదితరులు పాల్గొన్నారు.